క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



రేపల్లె రూరల్: ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పెనుమూడి గ్రామానికి చెందిన బొమ్మిడి వెంకటేశ్వరరావు ఇటీవల కిడ్నీ వ్యాధితో వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో వెంకటేశ్వరరావు కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 20 లక్షలు సీఎం సహాయనిధి చెక్కును ఆయన తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మృతుని భార్య పద్మావతికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దారం విజయ్, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

భట్టిప్రోలు: ఏపీ చేనేత కార్మిక సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం భట్టిప్రోలు రైలుపేట సొసైటీలో నాయకులు, కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సమితి సభ్యులు జి. బాలాజీ మాట్లాడుతూ.. చేనేత రక్షణ, కార్మికుల రక్షణ కోసం నిర్వహించే పోరాటాల్లో చేనేత కార్మికులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు కె. రామకోటేశ్వరరావు, కె మోహన్‌రావు, కార్మికులు ఎస్ జగన్‌మోహన్‌రావు, కె. కోటేశ్వరరావు, డి. రామారావు, బి. పెద్దిరాజులు, బాలకృష్ణ, కనకం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యం మెరుగు

కొల్లూరు : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చి ప్రజా ఆరోగ్యం మెరుగుపడటానికి అవకాశాలు పెరిగాయని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్.సుష్మ అన్నారు. మంగళవారం మండలంలోని చిలుమూరులో రెండో విడత నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పలు అనారోగ్య సమస్యలపై వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.రూపేష్, ఎస్. సాంబశివరావులు పాల్గొన్నారు.

వివేకానంద పురస్కారానికి యల్లాప్రగడ ఎంపిక



భట్టిప్రోలు: రేపల్లె నియోజకవర్గంలోని నగరంకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ధార్మిక వేత్త యల్లాప్రగడ సీతాపతి 2024 ఏడాదికి గానూ వివేకానంద పురస్కారానికి ఎంపికయ్యారు. వివేకానంద విద్యా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 12వ తేదీన ఈ పురస్కారాన్ని అందజేయడం జరుగుతుందని సంస్థ అధ్యక్షురాలు జంజనం జ్యోతిలక్ష్మి మంగళవారం తెలిపారు. సీతాపతి ప్రధానోపాధ్యాయులుగా పనిచేసే సమయంలో తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలవటమే కాక అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఆధ్యాత్మిక వేత్తగా పేరొందారు. ఈయనను ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, నిర్వాహకులు వి. కోటేశ్వరరావు, ఎం. రంగారావు, కేబీవీ రమణలు అభినందించారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్టు



పిట్టలవానిపాలెం: మండలపరిధిలోని పలు గ్రామాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను చందోలు ట్రైనింగ్ డీఎస్పీ శ్రీవిద్య అదుపులోకి తీసుకున్నారు.డీఎస్పీ శ్రీ విద్య మాట్లాడుతూ వీరిలో ఇద్దరిని రిమాండుకు పంపించి, ముగ్గురిని అరెస్టు చేశామని తెలిపారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో రెండు రోజులుగా దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా అల్లూరు, రెడ్లపాలెం గ్రామాల్లో దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారి వద్ద నుంచి 91 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండల పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిత్రపటం బహూకరణ

తెనాలిటౌన్: మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ 32వ వర్ధంతిని మంగళవారం పట్టణంలోని ఏఎస్ఎన్ కాలేజ్ ఆవరణలో జరిపారు. ఆయన చిత్రపటానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కాలేజ్ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తనయుడు, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు నందివెలుగు గ్రామ సర్పంచ్ దూళిపాళ్ళ పవన్‌కుమార్, అత్తోటకు చెందిన కిట్టు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు సత్యనారాయణ చిత్రపటాన్ని బహూకరించారు.

ప్రజా సంకల్పయాత్రతో ప్రజలకు భరోసా

- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి
- సీఎం జగన్ యాత్ర చేపట్టి నేటికి ఐదేళ్లు పూర్తి కావడంతో వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కోన రఘుపతి

బాపట్ల: ప్రజా సంకల్ప యాత్ర ప్రజలకు భరోసాగా నిలిచిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. యాత్ర చేపట్టి నేటికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక కోన ఛాంబర్‌లో ఎమ్మెల్యే కోన రఘుపతి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ పాదయాత్రతో ప్రజల హృదయాలను గెలిచిన మహోన్నతమైన నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. ప్రజల కష్టాలను నేరుగా చూసిన వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల అమలుతో ప్రతి ఒక్కరి కష్టాలను తీర్చేందుకు పాలన చేపట్టిన తొలిరోజు నుంచి ప్రయత్నం చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. అమ్మ ఒడి నుంచి, చేదోడు, రైతుభరోసా, ఆటో కార్మికులకు పదివేలు ఆర్థికసాయం వంటి ఎన్నో పథకాలు ప్రజలకు ఎంతో ధైర్యాన్ని నింపేవిధంగా ఉన్నాయని కోన చెప్పారు. 341రోజులు పాటు 3,648 కిలోమీటర్లు నడిచి ఐదువేల బహిరంగ సభలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చటంతోపాటు నేడు రాష్ట్ర ప్రజలు తమ జననేత గర్వంగా చెప్పుకునే స్థాయిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని కోన చెప్పారు. ఇంగ్లీషు మీడియంలో చదువులంటే విమర్శించిన నోర్లు సైతం విద్యార్థుల భవిష్యత్ కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారని చెప్పుకునే స్థాయికి తీసుకువచ్చారన్నారు. ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చూసుకోవాలని ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రజా సంకల్ప యాత్ర గుంటూరు జిల్లాలో తొలిగా బాపట్లలోనే ప్రారంభమైందని, ఈ యాత్రలోనే బాపట్లను జిల్లాగా చేసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చారని కోన చెప్పారు. బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణంతో పాటు నాలుగురోడ్లు జాతీయ రహదారి విస్తరణకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చూపిన చొరవ ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికి మరిచిపోరని కోన చెప్పారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, కొక్కిలిగడ్డ చెంచయ్య, షేక్.సయ్యద్‌మీర్, జోగి రాజా, నర్రావుల వెంకట్రావు,ఆట్ల ప్రసాదరెడ్డి, గొర్రుముచ్చు పుష్పరాజ్యం, లక్ష్మీరాఘవ, కటికల యెహోషువా తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మకం

పిట్టలవానిపాలెం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజా రంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలదండవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కత్తిరించి స్వీట్లు పంచిపెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర ద్వారా రాష్ట్రంలోని ప్రజా సమస్యలు తెలుసుకుని నవరత్నాలు పథకం ద్వారా ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృపానందం, లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ వెంకట శివారెడ్డి, బాపట్ల ఏఎంసీ డైరెక్టర్ తూనుగుంట్ల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కూసంపూడి దేవేంద్రరాజు, బొలగాని సుబ్బారావు, అల్లూరు సురేష్, చేబ్రోలు సురేష్, దబ్బుకూటి మాధవరావు, నర్రా శ్రీనివాసరావు, కుంతం ప్రసన్నరాజు, మధుసూదనరెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

పార్టీలోకి ఆహ్వానించిన డాక్టర్ ఈవూరి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈవూరి

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ఆయన చేసిన అభివృద్ధితో పలువురు వైఎస్సార్ సీపీలోకి వస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. గుడ్డికాయలంక సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సమన్వయకర్త గణేష్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో అద్దంకి రాంబాబు, అద్దంకి కాశీ నాగరాజు, తమ్మా శివాజీ గణేష్, అద్దంకి శకుంతల తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవూరి కేశవతి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం

డీపీఎం వాణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న వాణిశ్రీ

పిట్టలవానిపాలెం: సేంద్రియ వ్యవసాయం పట్ల రైతులు దృష్టి సారించాలని సేంద్రియ వ్యవసాయ బాపట్ల జిల్లా అధికారి వాణిశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని డ్వాక్రా స్వయం సహాయక సంఘ కార్యాలయంలో మంగళవారం బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని 5 మండలాల సీఆర్పీలు, ఎంపిక చేసిన రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సుస్థిర సేంద్రియ వ్యవసాయం నిర్వహించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్న పొలాలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగినప్పటికీ ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు.సేంద్రియ పద్ధతిలో పండించిన పంటకు, రసాయనిక మందులు ద్వారా పండించిన పంటకు ధరల విషయంలో వ్యత్యాసముంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది వరదానం, ఐసీఆర్పీలు ఉన్నారు.

ఎమ్మెల్యే రఘుపతిపై విమర్శలు మానండి



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమావేశమైన నాయకులు, కార్యకర్తలు

కర్లపాలెం: సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పార్టీని స్థాపించిన నాటి నుంచి కష్ట కాలంలో సైతం ఆయన వెంటే ఉంటూ వైఎస్సార్‌సీపీని బాపట్ల నియోజక వర్గంలో బలోపేతంచేసి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన స్థానిక శాసన సభ్యులు కోన రఘుపతిని పార్టీలోని నాయకులే విమర్శించటం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జిల్లా పార్టీ కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావులు పేర్కొన్నారు. కర్లపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మండల పార్టీ అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడుకొండలు మాట్లాడుతూ నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు ఎమ్మెల్యే కోన రఘుపతి దయతో ఎంపీటీసీ టిక్కెట్ తీసుకుని ఆయన సహకారంతో గెలిచారని గుర్తు చేశారు. గతాన్ని మరచి నేడు కోన రఘుపతికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే మేము ఓట్లు వేయమని చెప్పటం నీతిమాలిన చర్య అని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, చింతాయపాలెం సొసైటీ అధ్యక్షుడు పెద వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు ఆసిఫ్ అలీ, కోఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, పార్టీ నాయకులు గొర్రుముచ్చు మీరయ్య, కంకిపాటి నాగరాజు, గొర్ల సుబ్బారావు, చీరాల సత్యనారాయణరెడ్డి, ఆట్ల హరిబాబు, తోట వెంకటరమణ, గొర్ల సుబ్బారావు, డి.శివారెడ్డి, ధర్మేంద్ర, సుభాష్ చంద్రబోస్, బెనర్జి, షంషీర్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందించడమే లక్ష్యం

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి



మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతన పింఛన్లు పంపిణీ చేసిన వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం పింఛన్లను పెంపుదల చేయడం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు వరం లాంటిదని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండల పరిషత్ కార్యాలయంలో మంజూరైన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశోక్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వాగ్దానం చేసిన పథకాలన్నీ అమలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి ఆరు నెలలకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు అర్హత ఉన్నా కూడా పింఛన్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు యలవర్తి సురేష్, జడ్పీటీసీ సభ్యురాలు మూల్పూరు లావణ్య, మండల గ్రామ సచివాలయం కన్వీనర్ మోషే, కూచిపూడి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై కేసు నమోదు



రేపల్లె రూరల్: వివాహిత మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చోడాయపాలెం ఎస్ఐ అబ్దుల్‌రజాక్ మంగళవారం తెలిపారు. మండలంలోని పోటుమెరక గ్రామానికి చెందిన రేపల్లె రామాంజనేయులు కుమార్తె ప్రియాంకకు అదే గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావుకు రెండు సంవత్సరాల క్రితం వివాహమైందన్నారు. ఈ నెల 4వ తేదీన క్షణికావేశంలో ప్రియాంక ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పు అంటించుకోగా గమనించిన కుటుంబ సభ్యులు మంటలను అదుపు చేసి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారన్నారు. తీవ్రంగా గాయపడిన ప్రియాంక చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందిందన్నారు. రేపల్లె తహసీల్దార్ డి.మల్లికార్జునరావు సమక్షంలో శవపంచనామా నిర్వహించి మృతురాలి తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతురాలికి తొమ్మిది నెలల కుమారుడు ఉన్నాడు.

ముగ్గుల పోటీలకు స్పందన



విజేతలతో వాసవీక్లబ్ నిర్వాహకులు

భట్టిప్రోలు: వాసవీ క్లబ్, కుబేర వనిత క్లబ్, భట్టిప్రోలు–అద్దేపల్లి ఆర్యవైశ్య మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు కామన్ గిఫ్ట్ అందజేశారు. మొదటి మూడు స్థానాలలో నిలిచిన విజేతలకు బహుమతులు అందించారు. పోటీలను వాసవీ క్లబ్ అధ్యక్షుడు బూర్లె సుబ్బారావు, కుబేర వనిత క్లబ్ అధ్యక్షురాలు కోట నాగ జయలలిత, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు తూనుగుంట్ల సుధారాణిలు పర్యవేక్షించారు. ఈ పోటీలలో 60 మంది మహిళలు పాల్గొన్నారు.పోటీలను వాసవీ క్లబ్ నిర్వాహకులు బూర్లె రామప్రసాద్, కుర్లాళ్ల రవి కుమార్, తదితరులు పర్యవేక్షించారు.

17న కాకుమాను శంకరుని ధర్మసత్రం షాపుల వేలం

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీకాకుమాను శంకరుని ధర్మసత్రంకు చెందిన 12, 14 నెంబర్ల షాపులకు మూడేళ్ల అద్దె లైసెన్సు హక్కుకు సీల్డ్ టెండర్-కం-బహిరంగవేలం ఈనెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్టు కార్యనిర్వహణ అధికారి మండేపూడి పానకాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు దేవదాయ, ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో జరిగే వేలం పాటలో ఆసక్తిగలవారు పాల్గొనవచ్చని వివరించారు.

వన్‌టౌన్ సీఐ బాధ్యతల స్వీకారం

తెనాలిరూరల్: తెనాలి వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.దశరథరామారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 1998 బ్యాచ్‌కు చెందిన ఆయన నెల్లూరు జిల్లాలోనే ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. 2016లో సీఐగా పదోన్నతి పొంది గూడూరు టౌన్, రూరల్, నెల్లూరు పోర్టు, రైల్వేలో పని చేశారు. ప్రస్తుతం రేంజ్ వీఆర్ నుంచి తెనాలి వన్‌టౌన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, డీఎస్పీ బి.జనార్ధనరావులను మర్యాద పూర్వకంగా కలిశారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పరిధిలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు పండుగ తేదీలు మినహాయించి పోటీలు ఉంటాయన్నారు. ఐలవరం హైస్కూల్‌లో బ్యాడ్మింటన్, భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో కబడ్డీ, పెసర్లంక హైస్కూల్‌లో ఖోఖో పోటీలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని పేర్కొన్నారు. ప్రారంభ మ్యాచ్‌లకు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్తు వినియోగదారుల సదస్సు

వేమూరు: విద్యుత్ సమస్యలపై కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజనీరు గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు సబ్ స్టేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ యల్లమాటి మోహన్, జెడ్పీటీసీ సభ్యురాలు గాజుల హేమలత, మండల వ్యవసాయాధికారి సునీత కమిటీ సభ్యులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు, ఇండస్ట్రియల్ యాజమాన్యం, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను తెలియజేయాలని ఆయన కోరారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు.

జిల్లా వైద్యశాలలో హైరిస్క్ కేసులకూ శస్త్ర చికిత్సలు



శస్త్ర చికిత్స అనంతరం నాగేశ్వరమ్మ

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో హైరిస్క్ కేసులకు శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఓ వృద్ధురాలికి గుండె పనితీరు తక్కువగా ఉన్నా విరిగిన కాలుకు శస్త్ర చికిత్స చేసి ఆమెను ప్రాణాపాయం నుంచి తప్పించారు. జిల్లా వైద్యశాల వైద్యుల కథనం ప్రకారం.. తెనాలి బీసీ కాలనీకి చెందిన తాడికొండ నాగేశ్వరమ్మ (70), ఎడమ కాలు తొడ విరిగి జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం సోమవారం వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు గుండె 20 శాతం మాత్రమే పనిచేస్తుందని గుర్తించారు. ప్రమాదం అని తెలిసిన ఆమెకు వైద్యులు తగిన జాగ్రత్తలు తీసుకుని శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె క్షేమంగా ఉందని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స చేసిన వారిలో ఆర్థోపెడిక్ సీనియర్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు, డాక్టర్ టి.రాకేష్, మత్తు వైద్యులు డాక్టర్ మజీదబేగం, డాక్టర్ యశస్వి ఉన్నారు. విజయవంతంగా శస్త్ర చికిత్స చేసిన వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అభినందించారు.

నోవహు సువార్త పండుగలు



తెనాలిటౌన్: పట్టణ ఐతానగర్‌లోని పల్లవి గార్డెన్స్‌లో నోవహు సువార్త పండుగలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. నోవహు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ వి.ఇస్రాయేలు ఆధ్వర్యంలో సువార్త పండుగ ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రంగరాజు బైబిల్ నుంచి వాక్యోపదేశం చేశారు. ఏసుక్రీస్తు బోధనలను ప్రజలు ఆచరించాలని సూచించారు. మూడు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సభలు జరుగుతాయని నిర్వాహకులు రెవరెండ్ ఇస్రాయేలు తెలిపారు. రెవరెండ్ కె.విలియంకేరి, సంఘపెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలతోనే నేడు ఉన్నత పదవులు

నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి



సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు

యడవూరు(వేమూరు): డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాల కారణంగా నేడు అనేక పదవులు సాధించడం జరుగుతుందని నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని యడవూరు గ్రామంలో సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల దండలు వేసి నివాళులు అర్పించారు. గ్రామ సచివాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులతో మాట్లాడి గ్రామ సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కుర్రా లక్ష్మీనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

కర్లపాలెం: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు ఆదర్శవంతమైనవని ఎంపీపీ యారం వనజ, డీపీవో దాసరి రాంబాబు అన్నారు. జన్ బగీదరీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేరలిపాడు గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ కాగిత కరుణకుమారి, ఎంపీపీ యారం వనజ, డీపీవో రాంబాబు నివాళులర్పించారు. కర్లపాలెం సచివాలయంలో సర్పంచ్ నక్కా లలితకుమారి ఎంపీటీసీ సభ్యుడు ఆసిఫ్ అలీ, ఈవోపీఆర్డీ ఎలీషా బాబు, బిడారుదిబ్బ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పరమానంద కుమార్, సాగర్ నివాళులర్పించారు.

అంబేద్కర్ సేవలు మరువలేనివి

కొల్లూరు : రాజ్యాంగ సృష్టికర్త డా.బీఆర్.అంబేద్కర్ సేవలు మరువలేనివని పంచాయతీ కార్యదర్శి దానయ్య అన్నారు. మంగళవారం మండలంలోని చినపులివర్రు సచివాలయంలో ఈనెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణను పురస్కరించుకుని సామాజిక సమత సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటాన్ని పూలతో అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది అంబేద్కర్ ఫ్లెక్సీలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కనపర్తి మోహన్‌రావు, మాతంగి రత్నకుమార్, దున్నా బాబురావు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధన దిశగా కృషి

రేపల్లె రూరల్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పట్టణ సచివాలయాల కన్వీనర్ కమల్ అన్నారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో అంబేద్కర్ స్మృతి వనం ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలోని 10వ నెంబరు సచివాలయంలో మంగళవారం నిర్వహించిన వారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఖ్యాతిని తెలియజేస్తూ విజయవాడలో 120 అడుగుల భారీ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి జాతికి అంకితం చేస్తుందన్నారు. బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారం అందించాలన్న అంబేద్కర్ కలలను సాకారం చేస్తూ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. పలు సచివాలయాలలో వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్‌లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



పెదనందిపాడు: ఎరువుల షాపుల్లో నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పెదనందిపాడులోని మనగ్రోమోర్ సెంటర్, శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, నాగులపాడు జీడీసీఎంఎస్ కేంద్రాన్ని పెదనందిపాడు, అన్నపర్రు ఆర్బీకే సెంటర్‌లను ఆమె సందర్శించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని, అనుమతి పత్రాలు ఉన్న ఎరువులను మాత్రమే విక్రయించాలని, స్టాక్ రిజిస్టర్లు పక్కాగా మెయింటెన్ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న విధంగా స్టాక్ ఉండాలని ఆమె యాజమానులు, సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఏవో సుధారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com